

మూలం (బెంగాలీ):

శ్రీ పరశురామ్....

అనువాదం:

కె॥ జానకిరామ్ పట్నాయక్

# బటేశ్వరంబాబు

లోకంలో అత్తా కోడళ్లకు పొత్తు ఉండ దని చాలమంది వాదం; గాని కొన్ని సందర్భాల్లో అది రుజూ అవదేమో?

మాటకు బటేశ్వరబాబునే తీసుకుందాం! అత నింట్లో యీ అత్తాకోడళ్లు చాలాపొత్తుగా ఉంటారు! ఐతే-యిక్కడ అత్తాకోడళ్లంటే నా అభిప్రాయం లక్ష్మీ సరస్వతు లని!

తాత ముత్తాతల నుండీ బటేశ్వర బాబు ధనవంతుడు. తన తరం వచ్చే సరికి యావత్తు చరస్థిరాస్థులూ రమారమీ లక్షా ఏభయి వేలుంటుంది! ఇక పోతే—అతను ఆరి తేరిన రచయిత! కవి కాకపోయినా మాంచి కథకుడూ, నవలా కారుడూ! ఐతే—అతను ఏనాడూ చిన్న చిన్న కథలు రాసిన పాపాన పోలేదు. చిన్న కథలూ, గేయాలూ రాసినవాళ్లంతా అతని దృష్టిలో మామూలు రచయితలు. అతను ఎప్పుడూ ఏడెనిమిది వందల




పేజీలకు తక్కువ కాని నవలలు రాస్తుంటాడు! అతే అవి ప్రచురణ అయీ అవటంతో మహాఎక్కువైతే వదిహేను రోజుల్లో ఒక ప్రతి ఐనా మిగలకుండా అమ్ముడుపోతవి!వంగరాష్ట్రంలో పాఠక జనం ఆకలితో ఉన్న పెద్దపులుల్లా అతని నవలలమీద విరుచుకుపడుతుంటారు!

సూర్యోదయం అవుతున్నది! ఆ ఉదయకిరణాలు భవనాల నగరం వైన కలకత్తాను బంగారం మలాం పూస్తున్నది!

బటేశ్వరబాబు "స్టడీరూమ్" లో కూచుని రాతలో నిమగ్నమై ఉన్నాడు. మధ్య మధ్య దగ్గరపెట్టుకున్న 'చాదానీ' నుంచి తేనీరు వెండి కప్పులో పోసుకుంటూ తాగుతున్నాడు! అప్పు డొక అపరిచితవ్యక్తి జంకుజంకుతూఆగదిలో ప్రవేశించి, నమస్కరిస్తూ "క్షమించండి ....తమ అనుమతిలేకుండా.... ఐదునిముషాలు తమ రనుగ్రహిస్తే....నాపేరు ప్రియవ్రతరాయ్...." అన్నాడు.

ఆగంతకుని వయస్సు పాతికేళ్ళుంటాయ్! ముఖంలో సౌమ్యం ఉట్టి పడుతున్నది. వేసుకున్న బట్టలు భద్ర పురుషోచితంగా ఉన్నాయ్!

బటేశ్వరబాబు కుర్చీ చూపిస్తూ "కూచోండి" అన్నతను రాస్తున్న కాయితాల్ని సర్దుతూ మందహాసంతో "ఏదైనా కొత్త పత్రిక వెలువరిస్తున్నారా? దాని



కోసం రచన కావల్సొచ్చిందా? కాని మహాశయా! నేను రచనల కల్పతరువును కాను, ఎవరొచ్చి కోరితే వానికొక రచన ప్రదానంచేయటానికి!....ఆఁ....ఏదో శుభాకాంక్షలు అందచేయమంటే....నాలుగైదు వాక్యాలు రాసి ఇవ్వటానికి అభ్యంతరంలేదు. ఐతే.... ముందుగా పాతిక రూపాయీలు యివ్వాల్సి ఉంటుంది!" అన్నాడు.

"చిత్తం!....తమరనుకున్నట్టు నేను ఏపత్రికా వెలువరించే ఉద్దేశంలోలేను. దానికోసం రచన అవసర పడీరాలేదు!.. కేవలం చిన్న విషయం కనుక్కుందామని వచ్చాను!....దయచేసి —" "ప్రియవ్రత రాయ్ జవాబిచ్చాడు.

"ఓహో....ఐతే ఏఁవిటో త్వరగా తెమల్చిండి!" గంభీరంగా బటేశ్వర బాబు అన్నాడు.

ప్రగామిని పత్రికలో — ధారావాహికంగా వెలువడుతున్న తమ నవల 'ఏది శాశ్వతం?' అన్నది పూర్తి అవటానికింకా ఎంతకాలం పడుతుంది?"

"ఆరుమాసాలు పడుతుం దనుకుంటాను" అని "ఐతే చదివినంత వరకూ ఎలా ఉంది?" అని ప్రశ్నించాడు.

"అమోఘంగా ఉంది! అందులో పాత్ర లన్నీ సజీవంగా, మన ఎదటనే మసలుతున్నాయా అన్నట్టు ఉంది! చదువుతు పోతూంటే ఆకలీ, దప్పీ, నిద్రా, బాధా, రోగమూ, రొష్టూ - ఏదీ కనిపించదు! ఐతే కథానాయిక 'అలక' టి. బి. శానిటోరియంలో చికిత్స పొందుతున్నది కదా; చివరకు - బతికి బయటపడుతుందా ?"

ప్రియవ్రతరాయ్ ఆతృతచూసి బటేశ్వరబాబు చాల ఆనందించాడు. మృదువుగా నవ్వి" అరే? ఆ విషయం ఎలా చెప్పమంటారు? కథాంతం ఆరంభంలోనే తెలుసుకుంటే 'సస్పెన్సు' పోదూ?" అన్నాడు.

ప్రియవ్రతరాయ్ చేతులు జోడిస్తూ, అనునయంగా "చిత్తం! తమరు.... ఎలాగైనా అలకను బతికించండి! చాలు, మరేమీ కోరను!" అన్నాడు.

"మీ కోరిక మహా తమాషాగా ఉందే? ఒక కల్పిత నవలలోని, ఒక పాత్ర గురించి-మీ కెందుకీ ఆరాటం? ప్రతీ రచనా విషాదాంతఁవో, ప్రమోదాంతఁవో అవుతునే ఉంటుంది! పాఠకులుకూడా యీ రెండు తరహాల రచనలూ కోరుతూ ఉంటారు! ఎవరికిష్టమొచ్చినవి వారు చదువుతుంటారు!"

"అదికాదండీ - యీ నవలమాత్రం-అలకను బతికించి.... ప్రమోదాంతం చేయండి!"

"అది నా యిష్టాయిష్టాలమీద ఆధారపడివుంది!...."

"కాదు బటేశ్వరబాబూ!.... తమరీ విషయంలో అనుగ్రహించక తప్పదు-అలకను చంపకుండా—"




"బ్యాంకులోనుంచి డబ్బు తియ్యాలి, తియ్యాలి అంటావు; త్వరగా తీసి, నాది నాకు పారెయ్యగూడదూ?"
"తీసేటప్పుడు పట్టుకుంటారేమో అని భయంగా ఉందోయ్."

"కొంపతీసి మీకు పిచ్చి పట్టలేదు కదా?.... వెళ్లండి మహాశయా! అలకను గురించి మధ్య మీ తలకాయ పాడుచేసుకొని - యువతల నా కాలాన్ని దుర్వ్యయం చేయొద్దు!.... నమస్తే!"

ప్రియవ్రతరాయ్ మెల్లగ లేచి మాటాడకుండా, తల వంచుకొని వెళ్లిపోయాడు!

* * *

రాత్రి తొమ్మిది గంటలు! బటేశ్వర బాబు భోజనానికి లేచాడు! టెలిఫోను మోగింది!...ముందుకు అడుగు వేసినవాడల్లా, వెనక్కు తిరిగి - క్షణం ఆలోచించి...గబగబ రిసీవ రందుకున్నాడు—

"హలో....ఎవరు కావాలి?....ఆఁ.... బటేశ్వరబాబే మాటాడుతుంట .... తమ రెవరు?...."

"నేనండీ....సంజీవచటర్జీ.... ఎమ్. ఆర్. సి. ఎస్....సివిల్ సర్జన్..తమతో జరూరైన విషయం మాటాడాలి!.... రేపుదయం....ఎనిమిది ప్రాంతంలో - అవకాశం యిస్తే -" అవతల నుంచి జవాబు వచ్చింది.

"సరే .... ఐతే .... ఆ విషయం ఏఁవిటో...."

"ముఖస్థంగా చెబుతాను కదూ?.... నమస్తే" రిసీవరు ఉంచిన శబ్దం వినవచ్చింది.

డాక్టరు సంజీవచటర్జీ.... ఎమ్.ఆర్. సి. ఎస్ .... గురించి బటేశ్వరబాబు విన్నాడు. కలకత్తా మహానగరంలో 'మెడిసన్'లో గొప్ప పేరు ప్రఖ్యాతులున్నాయ్! విదేశాల్లో మాంచి తర్ఫీదు పొంది రెండేళ్లయి వచ్చాడు! కొల్లలుగా ధనం ఆర్జిస్తున్నాడు!

సకాలానికి డాక్టరు చటర్జీ బటేశ్వర బాబూ కలుసుకున్నారు. శిష్టాచార ప్రశ్నలయాక చటర్జీ అన్నాడు—

"తమ అమూల్య సమయాన్ని ఎక్కువగా వ్యర్థపెట్టను, కేవలం పదినిముషాలు! ప్రగామినిలో సీరియల్‌గా వస్తున్న తమ నవల మహాద్భుతఁ వైందని చెప్పటానికి గర్విస్తున్నాను! శరత్‌బాబు, తారాశంకర్, వనఫూల్ ....యిత్యాదుల్ని ఓడించేలా ఉన్నారు!"

బచేశ్వరబాబు చిర్నవ్వుతో "ధన్యవాదాలు!.... ఐతే—తమకు నవలలు చదవటానికి తీరిక ఉంటున్నదా?" అని అన్నాడు.

"అయ్యో లేకేం! ప్రముఖుల రచనలు, అభ్యుదయాన్ని కోరే ప్రతివ్యక్తీ ఎలానైనా సమయం చిక్కబట్టుకొని చదివి తీరాల్సిందే!—ఈమధ్య ఎక్కడకు వెళ్ళినా తమనవల గురించే ప్రసంగాలు వినవస్తున్నాయ్!—మొన్న మొన్న విషయం.... ఒకతను 'హెర్నియా' ఆపరేషనుకు వచ్చాడు. అచేతనావస్థలో కూడా—" నిజంగా 'అలక' ఎలాంటి పిల్ల?....ఆమె పాత్ర .... అత్యద్భుతం!— అని పలవరించాడు!" అన్నాడు డాక్టరు చటర్జీ.

బచేశ్వరబాబు నవ్వి ఊరుకున్నాడు.

"కాని—బచేశ్వరబాబూ! మాబంధువులూ, స్నేహితులూ పరంగా తమతో ఒక సంగతి మనవిచేయటానికొచ్చాను! తమ రెలానైనా కరుణించి అలకను వీలైనంత త్వరలో స్వస్థురాలిని చేసి బయట పడేలా చేయండి! అంతా ఆవిడ గురించే—ఏమవుతుందాఅని—విచారించుకొని ఉంటున్నారు."

"డాక్టరుగారూ!....క్షమించండి!.... నారచన—విషాదంతం!అలక బతకదు!" కుంఠిత స్వరంతో బచేశ్వరబాబు జవాబిచ్చాడు.

డాక్టరు త్రుళ్లిపడ్డాడు "ఆఁ....అలక బతకదా? ఎందుకు బతకదు?....అసలు బతక్కపోవటానికి ఏదైనా బలవత్తర కారణం ఉండా లంటారా ?.... ఆధునికమైన చికిత్సలు చేస్తే నూటికి తొంభై టి.బి. కేసులు బాగుపడుతున్నాయ్! అలకకు సరైన ట్రీట్‌మెంటు యిప్పించండి!....పి.ఎ. ఎస్. ఆయ్‌సోనా యజాయడ్; స్ట్రెప్టోమాయిసిన్ — ఇవన్నీ బీరుపోని ఔషధాలు !.... తమరు 'ఊఁ' అంటేచాలు — డాక్టర్ ఘోష్—టి. బి. స్పెషలిస్టును—సలహాయివ్వటానికి తమ దగ్గరకు పంపిస్తాను!" అన్నాడు.

బచేశ్వరబాబుకు డాక్టరు చటర్జీ ఏమంటున్నదీ బోధపడలేదు. అంతా అగమ్యంగా ఉం దాతనికి ! నిన్నటికి నిన్న ప్రియవ్రతరాయ్ వచ్చి పిచ్చి పిచ్చిగామాట్లాడి వెళ్ళిపోయాడు ! అతనికి మించిపోయి నట్టున్నా డీ డాక్టరు చటర్జీ!

మనసుకాస్త కుదుటపెట్టుకొని బచేశ్వరబా బన్నాడు—

"డాక్టరు బాబూ! నా నవలలో'అలక' ఒక కల్పిత పాత్ర అన్నమాట మర్చిపోయి, ఏదోఒక సజీవపాత్ర అన్నట్టుగా మాటాడుతున్నారు. నాకు మీ ప్రసంగం మహాశ్చర్యాన్ని కలిగిస్తున్నది :.... నా నవలలోని అలకను బతికించటానికి వీల్లేదు! ఒకప్పుడు బతికించానా....నా రచ నంతా భగ్గంపాడై పోతుంది !....



అలక చచ్చిపోవాలి! తరవాత—రెండేళ్ల నాటికి-ఆమెభర్త — హేమంతబాబుకూ, శర్వరికీ వివాహం జరగాలి! శర్వరి అంటే....ఐదేళ్ళుగా పెళ్ళి పెటాకులూ లేకుండా హేమంతబాబుకోసం — నిరీక్షిస్తూ కూచున్నదే....ఆవిడ — వీళ్ళిద్దరి వివాహంతో నవల పూర్తి అవుతుంది! అందువల్ల నా నవల....పూర్తిగా విషాదాంతంకాదు!....సెమీ ట్రాజడీ — అన్నమాట"—

"లేదు!...వీల్లేదు!" మేజామీద గుద్ది డాక్టరు చటర్జీ అన్నాడు—"అలక చచ్చిపోవడ మన్నది, ఎలోపతీ వైద్యానికి—డేమ్ యిన్సల్ట్ ! ఆవిడ చావడానికి ఎంతమాత్రం వీల్లేదు! హేమంతబాబు అలక హక్కు. ఆ హక్కును యితరులు హస్తగతం చేసుకోవటానికి వీల్లేదు!"

బచేశ్వరబాబు కించిత్ మందహాసంతో "డాక్టరు బాబూ ! మీరు అవతల శర్వరివేపు కూడా కొంచెం ధ్యానం ఉంచాలె! రూపంలోనూ, గుణంలోనూ, చదువులోనూ, ఐశ్వర్యంలోనూ శర్వరి అలకకు తీసిపోదు ! ఐదేళ్లయి ప్రతీక్షిస్తూకూడా శర్వరి హేమంతబాబును పొందలేకపోతే ఆ ప్రేమకు చెప్పరాని పరాజయం కలగదా ? శర్వరి హృదయం తునాతునకలై పోదా ?"

"భేష్...భేష్ ! హృదయం 'తునాతునకలై పోవడ'మంటే అంత మిట్ట మీద ఉం దనుకున్నారా ? హృదయాన్ననుసరించి - ఆవరించి -ఎలాంటి కఠిన తంతుసముదాయముందో తమకుతెలియదనుకుంటాను ! ఆఁ.... ఒకప్పుడు శర్వరి గుండెకాయ - బలహీనంగా ఉంటే తగిన చికిత్స చేయించవచ్చు!.. 'డిజిరాలిస్!' 'అమినో పాయిలిన్'; 'సర్‌పేసిల్'— ఇవన్నీ యిప్పించండి ! ఆపైని ఛాతీమీద 'బోరిక్ కంప్రెస్' లేదా 'పుల్టిస్' లేదా 'ఐస్‌బేగ్' ఉంచే యేర్పాటు చేయించండి !.... ఐనా .... అంత వయసు మీరిపోయాక - శర్వరికి- పెళ్లెందుకు - చెప్పండి ? .... ఛ-ఛ .... ఏమీ బాగులేదు !.... కావల్సొస్తే మెడికల్‌కాలేజీలో చేర్పించండి !.... డాక్టరీ ఐతే....చక్కగా, స్వతంత్రంగా ఉద్యోగం చేసుకుంటుంది ! తమరు అంగీకరిస్తే నేను స్వయాన 'హెల్త్ మినిస్టర్' దగ్గరకు వెళ్లి కాలేజీలో సీటు కోసం గట్టిగా సిఫార్స్ చేస్తాను !"

"మీరు నిజంగా నా రచన చదివి చాలా ఉత్తేజితులై పోతున్నారు ! మీ మెదడులో అలక - శర్వరి - ఎవరో రక్తసంబంధీకు లని భావిస్తున్నారు! వాస్తవానికి మీలాంటి డాక్టర్లనుకూడా నా రచన యిలాంటి స్థితికి తెచ్చిందంటే- గర్వించవలసిన విషయమే !.... ఐతే మీరు రచయితల వేపుకూడా కాస్త ధ్యానం ఉంచండి ! .... రచన అనేది సుఖాంతమో, దుఃఖాంతమో ఐఉంటుంది ! భగవంతుడు సుఖాన్నీ ఇస్తాడు!

దుఃఖాన్నీ యిస్తాడు ! అందుకే మానవుడు పుడుతున్నాడు - తరవాత చస్తున్నాడు ! రచయితలు కూడా ఆ భగవదుద్దేశానికి వ్యతిరేకించ లేరుకదా ? ఏ వ్యక్తీ కావలసి దుఃఖాన్ని తెచ్చిపెట్టుకొని నెత్తిని రుద్దుకోడుకదా ? కాని ఈ దుఃఖం - అంటే ట్రాజడీ - అనాదినుంచీ వస్తునే ఉన్నది ! అందువల్లనే ప్రాచీన కవులు సీతా, శకుంతలా, ఒఫేలియా - యిత్యాదులైన నారీమణుల్ని సృష్టించారు !...."

"ఏ మంటున్నారు ? భగవంతుని ఉద్దేశాన్ని రచయితలు వ్యతిరేకించలేదనా ? .... పాపం - ఆ భగవంతుడైనా ఏం చేస్తాడు చెప్పండి ?.... ప్రతీక్షణము అతను దయతలస్తూ ఉంటే కాలచక్రం సవ్యంగా తిరుగుతూ ఉంటుందా ? ఎలక మీద దయచూపాలీ అంటే పిల్లిని పస్తు పెట్టాలి ! లేడిని అనుగ్రహించాలంటే పులిచేత ఏకాదశీ వ్రతాలు చేయించాలి ! కోడి, బాతు, మేక, చేప యిత్యాదుల మీద కృప చూపించాలంటే మన నోట్లో కరక్కాయే! అత నేమో స్వయాన వివ శుడు ! సుఖ దుఃఖాల్ని సమపాళ్లగా అతను పంచకపోతే తన సృష్టికే గొప్ప అపచారం ! ఆఁ.... మానవ మాత్రులైన రచయితలున్నారంటే, నందిని పందిగా, పందిని నందిగా చేయగలరు ! 'కవయో నిరంకుశః' అని ఉత్తినే అన్నారా ? ఐతే. అలా నని తమ యిష్టమొచ్చినప్పుడల్లా మనుషుల్ని హతమార్చడం కాదు! ప్రాచీనులు - వాల్మీకి, కాళిదాసు, షేక్స్పియరు-ఏంవిటి రాశారో మర్చిపోండి!.. ఇది గాంధీయుగం !. 'హింస' అనే పదం శబ్దకోశంనుంచి తుడిచి పెట్టాల్సిందే ! కాగా యీ రోజుల్లో మానవులు అడుగడుక్కూ ఏదో ఒకందుకు ఏడుస్తునే ఉన్నారు. మీదుమిక్కిలి తమబోటి రచయితలు వాళ్ల నెత్తిని మరింత యేడుపు రుద్దితే వాళ్లేమవుతారో ఆలోచించండి?.. తమకు రాయలని ఉంటే —— ఆనందం, ఆహ్లాదం, సౌఖ్యం, భోగం, విలాసం మొదలైన విషయాల మీద రాయండి ! అంతేకాని — ఏడుస్తున్నవాళ్లను మరింత ఏడిపించవద్దు——"

బటేశ్వరబాబుకు మతి పోయింది ! ఈ డాక్టరు చటర్జీ ధోరణి ఏమిటో తెలియలేదు ! కొంపతీసి పిచ్చివాడు కాడుకదా ! పైగా తననూ పిచ్చి ఎత్తి పోయేలా చేస్తున్నాడు ! ఇకను ఊరుకుంటే లాభం లేదు —

"క్షమించండి డాక్టరుగారూ ! తమది విజ్ఞానరంగం ! నాది సాహిత్యరంగం ! మన అభిప్రాయాలు ఉత్తర దక్షిణ ధృవాలు ! ఇక తమరు నాకు సావకాశాన్నిస్తే - ఆనందిస్తాను ——" రూక్షంగా అన్నాడు.

డాక్టరు చటర్జీ చివాల్న లేచి, కుర్చీ 'బర్' మని వెనక్కు జరిపి - స్వరంలో గాంభీర్యం ఉట్టిపడేలా అన్నాడు —



"తమతో వాదవివాదాలు పెట్టుకోవటానికి రాలేదు ! కాని పట్టపగట్లో — తమరొక అమాయక వ్యక్తిని, అందులోనూ ఆడదాన్ని బలవంతంగా హతమార్చడానికి చూస్తుంటే — అది తగని పని అని చెప్పటాని కొచ్చాను !.... నేను డాక్టరును ! నా చేతనైనంతవరకూ మానవుల్ని రక్షించడం నా కర్తవ్యం ! ఆ కర్తవ్యం నిభాయించుకోవటానికి కూడా వచ్చాను ! తమతో ప్రసంగించాను ! తమకు నా ఉద్దేశం బోధపడలేదు ! సరే !.... తమ కేది సమ్మతంవో అది చేయండి !.... కాని కాస్త జాగ్రతగా ఉండండి : ఒంటరిగా తిరగబోయేరు?.... వెధవది —గుంటకా రంతా తమ విషాదాంత రచనలు చదివి — చదివి కుతకుత లాడిపోతున్నారు !.... ఇక - ఈ నవలకూడా చదివారంటే ఏంచేసి పోతారో ?.... ఐనా - పరవాలేదు లెండి !.... ఎప్పుడైనా కాలుగాని, చెయ్యిగాని విరిగిందంటే —— ఆలస్యం చెయ్యకుండా ఫోను చెయ్యండి ! నా ఫోను నెంబరు కలకత్తాలో ఉన్న ప్రతీ ఎక్స్చేంజాపీసుకూ తెలుసు!.... లిప్తలమీద హాజరవుతాను !.... శలవ్ !.... నమస్తే !"

డాక్టరుచటర్జీ జవాబుకేనా నిరీక్షించకుండా పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్లిపోయాడు. ! కాని బటేశ్వరబాబు తలకాయను మాత్రం 'కిచిడీ' ముద్దను చేసి మరీ పోయాడు ! ఐనా, యీ పిచ్చి వాగుడులో తనెందుకు పడాలి ? తను రచయిత ! తన సంకల్పం యథాతథంగా జరగాల్సిందే ! తనకు యింకొకరు—— అందులోనూ సాహిత్యం అంటే ఏమిటో తెలియనివారు —— సలహా యివ్వడమేమిటి ?.... కానైతే... డాక్టరు చివరలో అన్నదాంట్లో కూడా అబద్ధం లేకపోవచ్చు ! ఎందుకైనా —— 'జాగ్రత'గా ఉండటం మంచిది.

* * *



"నా కేదేనా ఉద్యోగమైనా చూసిపెట్టండి పంతులుగారూ."

"ఆదేమిటోయ్, యిప్పుడు చేస్తున్న ఉద్యోగం ఏమయింది ?"

"ఏమయిందని అడుగుతారా, మీ బాకీ ఈ రోజు వసూలు చేసుకురాకపోతే మా షావుకారు నా ఉద్యోగం ఊడగొడతానన్నాడు."

మూడురోజుల తరవాత !

బఛేశ్వరబాబు బర్మాచుట్ట కాలుస్తూ వరండాలోకూచుని ఏదోఆలోచిస్తున్నాడు. నౌకరుకుర్రాడొచ్చి—"బాబూ! తమకోసం ఎవరో ఒకావిడవచ్చి—దిగవహాల్లో ఉన్నారు. తమర్ని అర్జంటుగా కలుసుకోవాలంట —" అన్నాడు.

"ఒకావిడా ?...సరే ! పిల్చుకురా!" అన్నాడు బఛేశ్వరబాబు సావధానంగా కూచుంటూ.

మరో నిమషానికి ఒక నాగరిక యువతి ప్రవేశించి "నమస్తే" అని మార్దవంగా చేతులు జోడించింది.

చిన్న పిప్పళ్ల బస్తాలా లేకపోతే మాత్రం ఆవిడ చాల సౌందర్యవతే అని చెప్పాలి ! వయసు యిరువైనాలుగూ — ఐదూ ఉంటుంది !

బఛేశ్వరబాబు ప్రతి నమస్కారం చేస్తూ "మీరెవరో :...ఎక్కణ్ణుంచి వస్తూన్నారో —" అర్థోక్తిలోనే ఆమె చిర్నవ్వుతో" అరెరె ? తమరు నన్ను పోల్చుకోనట్టుంది ?....నా పేరు కాదంబిని ! సినీతారను ! వెండితెరమీద నన్ను చూసే ఉంటారు !" అన్నది.

"ఓ హో ! ....అలానా ?.... నేను సినీమాలు తక్కువగా చూస్తుంటాను లెండి! గుర్తుకురావటంలేదు!....నిల్చునే ఉన్నారు....కూచోండి !" అని కుర్చీ చూపించాడు.

కాదంబిని కూచుంటూ "తమరు నన్ను బహువచన ప్రయోగం చేస్తున్నారు. తమకన్నా నేనన్నివిధాలా చిన్నదాన్ను ! ఏకవచనంగా మాటాడండి !" అన్నది.

"పసివాళ్లనూ, నౌకర్లనూ, యింటివాళ్ళనూ తప్పించి తక్కినవాళ్ళతో నేను బహువచనంగానే మాటాడతాను ! అది నా నియమం ! మీరు విచారించక్కర లేదు."

కాదంబిని బుగ్గను తాంబూలం ఉంచుకొని, మధ్యమధ్య దాన్ని సేవిస్తూ మాటాడుతున్నది ! బఛేశ్వరబాబు కది అసభ్యంగా కనిపించింది. కాని బయట కేలాంటి భావాన్నీ కనిపించనివ్వలేదు.

"ఐతే....దేనికోసం ఇలావచ్చారు ? ప్రశ్నించా డతను.

"ప్రగామినిలోని తమ నవల ఏదైనా జరిగిన సంఘటనమీద రాస్తున్నారా ? లేక వూహాకల్పితమేనా ? .... దాన్ని చదువుకుపోతూంటే కళ్ళఎదుట ప్రతివిషయమూ నడుస్తున్నట్టే అనిపిస్తున్నది—"

"ధన్యవాదాలు ! నా నవల ఊహాకల్పితమే !"

"ఆశ్చర్యం ! నేనేమో జరిగిన సంఘటనమీద రాస్తున్నా రని తలస్తున్నాను !....ఐతే నేనిప్పుడు రావటం చిన్న 'బిజినెస్' విషయంలో మాటాడ్డానికి, తమ శలవైతే—"

"అవశ్యంగా మాటాడండి !"



"తమ నవలను ఆధారం చేసుకొని 'ఫిల్మ్' తీయాలని సంకల్పించుకున్నాను! ....ప్రొడ్యూసరు లాలాఘుమ్‌ఘుమ్ చందుగారితో మాటాడాను. పది లక్షలు పెట్టుబడి పెట్టడానికి ఒప్పుకున్నారు ! బిమల్‌రాయ్‌గాని, దేవకీబోసుగాని దర్శకత్వం వహిస్తారు. నేను హీరోయిన్-అంటే-అలక-పాత్ర తీసుకుంటాను ! తమకు పురస్కారంగా పదిహేనువేలు రూపాయిలు ముడుతుంది !....తమ అంగీకారమైతే—"

బఛేశ్వరబాబు ఉబ్బులింగడైపోయాడు—.

"నా అంగీకారానికేముంది ?... అందులోనూ మీరు అలక పాత్రవహించటం....ఫిలిం సర్వోత్తమంగా ఉంటుంది ! ఐతే నవల యింకాపూర్తి కాలేదు. అంటే ప్రచురణసంగతి చెబుతూంట. మరో ఆరుమాసాలు పడుతుంది—" అన్నాడు.

"అలానే కానివ్వండి ! మాకూ యివతల వ్యవధికావాలికదా? మా సన్నాహాలు పూర్తి అయేసరికి అదే టైము పడుతుంది. ఐతే...యీ మధ్యస్థంలో యింకెవరైనా నవలను లాక్కుంటారనే భయంకొద్దీ త్వరగా రావల్సొచ్చింది. తమ వాగ్దానం లభిస్తే....ప్రచురణపూర్తయాకే 'కంట్రాక్టు' రాసుకుందాం !"

"సరే! నేను మరెవరికీ మాటివ్వను!"

"ధన్యవాదాలు ! .... చిత్రంలో నా అభినయం .... అలకపాత్రలో-ఎలాగుంటుందో తమరే చూస్తారు ! .... చివర ఘట్టంలో-అలక-పరిపూర్ణారోగ్యంతో, బోసినవ్వు లొలకపోస్తున్న చిన్నారిబాబును చేతుల్లో ఉంచుకొని-తెరమీద కనిపించేసరికి, హాలంతా హర్షధ్వనుల్తో మార్మోగిపోతుంది ! ఆ సమయంలోగాని తమరుంటే-ప్రేక్షకజనం-బ్రహ్మరథం పట్టేస్తారు—"

బఛేశ్వరబాబు ముఖారవిందం ముకుళించుకుపోయింది ! ఖిన్న స్వరంతో — "కాదంబినీ ! మీరు భ్రమలో పడిపోయారు ! నా నవల దుఃఖాంతం !.... అలక చచ్చిపోతుంది !....తరవాత రెండేళ్లనాటికి హేమంతబాబుకూ-శర్వరికీ వివాహం అవుతుంది" అన్నాడు.

కాదంబిని తృళ్లిపడి, విశాల నేత్రాల్ని మరింత విశాలంచేసి— "ఆఁ...అలక చచ్చిపోతుందా ? ....కథ....దుఃఖాంతమా ? అలానైతే నేను అలక పాత్ర తీసుకోను !....అసలు యీ ఫిల్మ్ తీయటంలోనే కలగజేసుకోను," అన్నది నిరుత్సాహంగా.

"దుఃఖాంత చిత్రంలో మీరు ఇంకా ఉత్తమోత్తమంగా నటించి ప్రజల మన్నన పొందకూడదా ?" అన్నాడు బఛేశ్వరబాబు, ప్రోత్సహించే ఉద్దేశంతో !

"ఉఁహుఁ ! నేను దుఃఖాంత కథల్లో నటించను ! చావటానికి నేను తయారుకాలేను! ... భగవన్నిర్ణయాను

సారం ఒక చావు వుండనేవుంది! మళ్ళీ మధ్యంతరాల్లో...యీ తెచ్చిపెట్టుకున్న చావులేఁవిటి? నా కంత ఓపికలేదు!... నిజంగా తమరు నా ఆశ లన్నిటినీ గంగలో కలిపేశారు——'' చిన్నపోయిన ముఖంతో కాదంబిని అన్నది.

బటేశ్వరబాబు హృదయం డోలాందోళిత మైపోయింది! వేలకు వేలు రూపాయలు! సినీజగత్తులో పేరు ప్రఖ్యాతులు! ఇదేగాని విజయవంత మైతే, తన'వాల్యూ' ఆకాశా న్నంటుకు పోతుంది!....ఎదురుగా వస్తూన్న అదృష్టాన్ని కాలదన్నటం గొప్ప అవివేకం!

''మీరు నాకు వ్యవధి యివ్వండి! కథ సుఖాంతంగా మార్చటాని కేమైనా అవకాశా లున్నాయేమో చూస్తాను!'' అన్నాడు ధోరణి మార్చుకుంటూ!

"క్షమించండి! నా కంతవరకూ 'టైం' లేదు! రేపే బొంబాయి వెళ్ళి పోతున్నాను! లాలాఘుమ్‌ఘుమ్‌చందు గారికి ఏదో ఒక జవా బివ్వాలికదా!'' నిష్కర్షగా కాదంబిని జవా బిచ్చింది!

''బటేశ్వరబాబు లేచి కిటికీదగ్గరకు వెళ్ళి నిల్చొని ఐదునిమషా లాలోచించాడు!...తరవాత కాదంబినివేపు తిరిగి సరే!...మీ వుద్దేశ౦వే నెరవేరుతుంది!" అన్నాడు.

కాదంబిని ఉత్ఫుల్ల స్వరంతో "ధన్యవాదాలు బటేశ్వరబాబూ! నిజంగా తమరు ఉదారహృదయులు! ఆడదాన్నని నామాట కొట్టిపారేయకుండా నిలిపారు! వీలైనంత త్వరలో నవల పూర్తిప్రచురణచేయండి! ... ఆఁ.... చివర ఘట్టంలో మాత్రం....నా కోరిక ప్రకారం ... ఆరోగ్యవతిఐన అలక చేతుల్లో .... ముద్దులబాబును ఉంచటం మర్చిపోవద్దు!..."అంటూ, వానిటీ బేగ్‌నుంచి నూరేసిరూపాయీలవి పది నోట్లు తీసి, అతని కందిస్తూ "బజానాగా ఉంచండి" అన్నది. వాటిని తీసుకొని "మళ్ళీ ఎప్పుడు కలుస్తారు?" అని బటేశ్వరబాబు ప్రశ్నించాడు.

"బొంబాయినుంచి రాగానే!... నమస్తే!" అని కాదంబిని వెళ్ళిపోయింది.

* * *

బటేశ్వరబాబు తనమాట నిలబెట్టుకున్నాడు! అతని నవల 'ఏదిశాశ్వతం?' అన్నది 'చీకటి-వెన్నెల' పేరుతో, సుఖాంతంగా సమాప్త మైంది!...కాని అప్పటికప్పుడే ఎనిమిది నెలలు దాటిపోయాయ్! కాదంబిని పత్తా ఫికరు లేదు! బొంబాయినుంచి రాగానే వస్తానని చెప్పింది! చివర కామె చిరునామాఐనా అతను తీసుకోలేదు!

ఉదయం ఎనిమిదవుతున్నది! స్టడీ రూమ్‌లో కూచొని బటేశ్వరబాబు కలాన్ని శరవేగంతో పరువెత్తిస్తున్నాడు! అది అతని కొత్తనవల—— 'మనసు లాగి-దోబూచులాట.'



అంతలో-పరిచిత కంఠస్వరం వినవచ్చింది. "లోనికి రావొచ్చా బటేశ్వర బాబూ?"

జవాబుకు చూడకుండా డాక్టరు సంజీవచటర్జీ ప్రవేశించాడు! అతని వెనక ప్రియవ్రతరాయ్-ఒక అపరిచిత యువతీ ఉన్నారు!

"నమస్తే మహాశయా! తమ నవల ...ఓః .... అత్యద్భుతంగా సమాప్తం చేశారు! శత సహస్ర ధన్యవాదాలు! ....ఇదిగో-వీరిని బహుశా తమరు పోల్చి ఉంటారు! ప్రియవ్రతరాయ్!....ఈవెడ తమ కథానాయిక అలక! ఈవిణ్ణీ, తమరు ప్రాణదానం చేశారు! చిరకృతజ్ఞులం!'' అన్నాడు డాక్టరు చటర్జీ!

బటేశ్వరబాబు పాదాల దగ్గర ఒక యీతాకులబుట్ట ఉంచి, నమస్కరించి అలక పక్కగా పోయి నిల్చుంది!

"తమకోసం-అలక స్వయాన ఏవో మిఠాయీలు తయారు చేసింది! అనుగ్రహించి స్వీకరించండి!" తిరుగా చటర్జీ అన్నాడు.

అందరివేపూ విస్మయంగా చూసి "ఏఁవిటిదంతాన్న? .... ఏఁవీ బోధపడలేదు!" అన్నాడు బటేశ్వరబాబు. అతని సంధిగ్ధావస్థ చూసి చటర్జీ నవ్వుకున్నాడు. ఒక కుర్చీలో కూచొని ఆరంభించాడు.

"మీ నవలలోని ఉపసంహార ఘట్టం ఇదే-బటేశ్వరబాబూ! సంగతులు విస్తరించి చెబుతాను. సావధానంగా వినండి! ఈవెడ అలక! ప్రియవ్రతరాయ్‌బాబు భార్య! కాగా నాకు మరదలు! అంటే నా భార్యా చెల్లెలు! ఏడాదై అలక టి. బి. శానిటోరియంలో చికిత్స పొందుతున్నది. ఆరోగ్యదశకు వస్తూండే సరికి యీవిడ చేతిలో ప్రగామిని పత్రిక పడ్డది! అందులో-ధారావాహికంగా ప్రచురితమవుతున్న తమ నవల 'ఏదిశాశ్వతం?' చదవనారంభించింది! చదువుతూ, చదువుతూ ఉండేసరికి యీవెడలో ఆశ్చర్యమైన మార్పు వచ్చింది! నవలలోని అలక-టీ. బీ. నుండి బయటపడి స్వస్థత



ప్రేయసి: ఎప్పుడూ మీరు కాగితం పువ్వులే పట్టుకొస్తారేం?
ప్రియుడు: ఏంచెయ్యను. నువ్వు వచ్చేటప్పటికి నిజం పువ్వులైతే ఒడిలిపోతున్నాయి.

పొందితే-తనూ స్వస్థత పొందుతా ననీ-లేనట్టయితే తనకూ చావు తప్పదనీ-ఒక నిశ్చితాభిప్రాయానికి వచ్చింది! ఆ అభిప్రాయాన్ని ఎవరూ మార్చలేక పోయారు! ప్రఖ్యాత 'బ్రెయిన్ స్పెషలిస్ట్' డాక్టరు సర్కారుకు చూపించాం! అతను పరీక్ష చేసి లాభం లేదన్నాడు! ఈమె చావుబతుకులు ఆనవల మీదే ఆధారపడి ఉంటుందని నిష్కర్షగా చెప్పేశాడు! మాకేమీ తోచిందికాదు. చివరకు ప్రియవ్రతబాబును మీదగ్గరకు పంపించాం! ఐతే తమ రీతణ్ణి పిచ్చివాళ్ళలో జమకట్టి పంపించేశారు! తరవాత నేను స్వయాన దర్శించాను. మనిద్దరి మధ్యా-మహత్వపూర్వమైన సంభాషణ నడిచింది. అప్పటికీ తమరు వ్యగ్రభావంతో నన్నుకూడా సాగనంపారు!—ఈ సంగతులన్నీ నా భార్యా విన్నది! మమ్మల్ని పడచివాట్లు పెట్టింది! వెంటనే తమదగ్గరకు వచ్చింది! — రావడమేమిటి-పని విజయవంతం చేసుకోవడమేమిటి-జరిపించింది!—తమరు నవలను సుఖాంతం చేశారు!—అలక పరిపూర్ణారోగ్యవతి ఐంది! మీ ఎదటనే వుంది చూడండి!—ఆశీర్వదించండి—"

బసేశ్వరబాబు దీర్ఘంగా నిట్టూర్చి "బలేగాఉంది వ్యవహారం?—ఐతే నా దగ్గరకు—ఎవరో—సినీ అభినేత్రి ....పేరు....అ(...కాదంబిని అన్న ఆమె వచ్చిందే!" అన్నాడు.

డాక్టరు చటర్జీ నవ్వి "హుష్!... ఆవిడేకాదు, ఏడేడు పద్నాలుగు తరాల్లో ఆవిడ వంశంలోహా శ్శెవరూ సినీమాల్లో నటించలేదు! తమరిని ఒప్పించటానికి అలా వచ్చింది! ఆమే...నా భార్యా... వకుళ!" అన్నాడు.

"ఆవిడ యిప్పుడేం రాలేదు?" నవ్వుతూ బసేశ్వరబాబు ప్రశ్నించాడు.

"వీల్లేకపోయింది! ... మెటర్నటీ హోంలో వుంది! ...మగపిల్లాడు కలిగాడు. వారమైంది! ... ఆ తల్లీకొడుకులూ తమకు క్షమాపణ చెప్పుకోడానికి త్వరలోనే వస్తారులెండి!—"

"ఆ వెయ్యిరూపాయిలూ... ఎడ్వాన్సుగా యిచ్చింది—"

మధ్యలోనే అందుకొని—"అబ్బే! ...తమకు రుణపడ్డదాంట్లో...అదేమాత్రం?...ఇక శలవ్!" అంటూ డాక్టరు చటర్జీ లేచాడు!

# దాశరథీ  కరుణాపయోనిధీ

కష్టము కల్గినప్పుడు జగం బిరుకై నొక గోష్పమంత నైసం
తుష్టియె కల్గినప్పుడదె తోచును గాదె విశాలమైన త్రై
విష్టప రాజ్యమై సురగవీ సహితమ్ముగ; కష్ట, తుష్టి సం
దష్టము ప్రాణి జీవితము, దాశరథీ! కరుణా పయోనిధీ!

గుండియ లేనికొండలకు, గుండియ నీరయి పారు వాగుతో
దండ కుదిర్చినాడవుకదా! మరి నీడకు వెల్గుజాడకున్
పెండిలి చేసినావు, వరణీయు నిరాదరణీయునై కథా
దండన సేయ జూచెదవు, దాశరథీ! కరుణా పయోనిధీ!

పోయిరి జాతిగూర్చి మృతిబొందినవారలు — కాని జ్ఞప్తి రా
దాయెను వారి గూర్చిన కథావళి ఇంచుకగూడ జాతికిన్;
నా యిలు, నా సతీసుతులు, నా ధన ధాన్యము లన్న వారి సొ
త్తాయెను రాజ్య పీఠములు, దాశరథీ! కరుణా పయోనిధీ!

నిగ్రహశాలియైన మహనీయుడు గాంధి యొనర్చినట్టి స
త్యాగ్రహమందు పాల్గొనిన తాము ప్రభుత్వమునందు చేరి నే
డాగ్రహమందనేల తమ యట్టుల అన్యులుగూడ నేడు స
త్యాగ్రహ మాచరించు నెడ? దాశరథీ! కరుణా పయోనిధీ!

'దాశరథి'